# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 20 ఆగస్టు 2025 | ■ 12 పేజీలు





## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు





- తక్షణ సహాయం అందేలా చర్యలు
- ఆదిలాబాద్‌లో దెబ్బతిన్న పంటల పరిశీలన
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి..
- వరద బాధితులకు మంత్రి భరోసా
- కడెం ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్, ఎమ్మెల్యే..
- వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పంట నష్టపరిహారం
- ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- మంత్రి ప్రకటనపై అన్నదాతల హర్షం



# వరద బాధితులకు అండగా ప్రభుత్వం



■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ముందుగా ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం భారీ వర్షాలతో వచ్చిన వరదలు నష్టంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారీ వర్షాలు వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి, తంతోలి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును మంత్రి జూపల్లి సందర్శించారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే రూ.9కోట్ల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మండలాల వారీగా, శాఖల వారీగా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు రూ.10 వేల పంట నష్టపరిహారం అందిస్తామని జూపల్లి ప్రకటించారు.

## సిర్పూర్‌లో పెద్ద పులి కలవరం

- సిర్పూర్ (టీ) అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవుపై దాడి చేసి హతమార్చిన పెద్దపులి
- వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్న స్థానికులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు




కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్‌లో పులుల సంచారం కలవరం రేపుతోంది. సిర్పూర్ (టీ)అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవుపై పెద్దపులి దాడి హతమార్చింది. బెస్తవాడకు చెందిన బానే రాంచందర్ చెందిన ఆవు సోమవారం అటవీలో మేతకు సాయంత్రం తిరిగి వస్తుండగా పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## ముధోల్‌కు 45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు

ముధోల్‌లో రూ.45.15 కోట్ల నిధులతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరైనట్లు ఎమ్మెల్యే రామరావ్ పటేల్ తెలిపారు. గతంలో ఇక్కడ ఐటీఐ కళాశాల మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రిని కోరడంతో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమన్నారు. 2లో




## ప్రపంచంలో అత్యంత అరుదైన బ్లూ కలర్ మష్రూమ్స్

■ కాగజ్‌నగర్ డివిజన్ అటవీ ప్రాంతంలో అరుదైన పుట్టగొడుగు

ప్రపంచంలో అత్యంత అరుదైన బ్లూ కలర్ మష్రూమ్స్ తెలంగాణలో బయ టపడింది. రాష్ట్రంలోని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ విభాగంలో ఈ అరుదైన పుట్టగొడుగును కనుక్కున్నారు. అత్యంత ఆకర్షణీ యమైన ఈ శిలీంధ్రంను 'బ్లూ పింక్‌గిల్' అని పిలుస్తారు. ఇది న్యూజిలాండ్‌కు చెందిన ఒక ప్రత్యేక శిలీంధ్ర జాతి. అంతేకాదు న్యూజిలాండ్ దేశం కరెన్సీ 50 నోటుపై ఈ అందమైన బ్లూ మష్రూమ్స్ బొమ్మ ఉంటుంది.

## అవసరం మేరకు మాత్రమే యూరియా వాడాలి




## రెండో రోజుకు చేరిన ఎమ్మెల్యే పాల్వాయి దీక్ష



పోడు సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం 2వరోజుకు చేరింది. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా కాకుండా పూర్తిగా రద్దు చేశామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వివరాలు 12లో



# యూరియా అవసరం మేరకు మాత్రమే వాడాలి

- అంతర్రాష్ట్ర చెక్ పోస్టును సందర్శించిన కలెక్టర్, సీపీ
- టాస్క్ ఫోర్స్ టీం ద్వారా యూరియా అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు..
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**కోటపల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం సందర్శించారు. కోటపల్లి మండలంలో తీవ్ర యూరియా కొరత ఏర్పడిన నేపథ్యంలో సరిహద్దులలో చెక్ పోస్టును అధికారులు ఏర్పాటు చేయగా ఈ చెక్ పోస్టును కలెక్టర్, సిపిలు ఇరువురు సందర్శించి చెక్ పోస్ట్ నిర్వహణ పైన పలు సూచనలు చేశారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉందని, యూరియాను పంట సాగుకు మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామ వద్ద ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌ను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీం ద్వారా యూరియా అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 2 వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, గత సంవత్సరం ఆగస్టు 19 నాటితో పోలిస్తే 500 మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువగా విక్రయించడం జరిగిందని తెలిపారు. యూరియా లేదనే అవాస్తవాన్ని ఎవరు నమ్మకూడదని, సాగుకు అవసరమైన 3 బస్తాలలో 2 బస్తాలను ఇప్పటికే రైతులకు అందించడం జరిగిందని, మిగిలిన 1 వస్తా యూరియాను సకాలంలో అందిస్తామని తెలిపారు. రైతులకు రాయితీతో 265 రూపాయలకు ఒక బస్తా చొప్పున యూరియా అందించడం జరుగుతుందని, పంట సాగుకు తప్ప ఇతర అవసరాలకు వినియోగించకూడదని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా కొనుగోలు చేసే వారి వివరాలను పరిశీలించడం జరుగుతుందని, అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 14వ తేదీన సరైన ఆధారాలు లేకుండా అక్రమంగా యూరియా రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకొని సంబంధిత వ్యక్తులపై 6ఎ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. యూరియా విక్రయ దుకాణదారులు తమ దుకాణంలో యూరియా నిల్వలు, ధరల పట్టికను ప్రదర్శించాలని, వ్యవసాయ శాఖ అధికారులు యూరియా సంబంధిత వివరాలతో ప్రతిరోజు నివేదిక అందించాలని తెలిపారు. డ్రోన్ల ద్వారా పిచికారి చేసే మినీ యూరియా జిల్లాలోని చెన్నూర్‌లో అందుబాటులో ఉందని, అవసరం కలిగిన రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన గిరిజనులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు . జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం దర్తీ అభజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్, ఆది ఖర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశానికి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జుగా పథకంలో భాగంగా ఆధి కర్మ యోగి కార్యక్రమాల ద్వారా జిల్లాలో 12 మండలాల పరిధిలోని 102 గ్రామాలలో ఉన్న గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరే విధంగా బ్లాక్ స్థాయి(మండల) మాస్టర్ ట్రైనర్లు, గ్రామ స్థాయి శిక్షకులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, వైద్య, ఆరోగ్య, అటవీ, విద్య, శిశు సంక్షేమ శాఖల నుంచి బ్లాక్ స్థాయి ట్రైనర్లు, పంచాయతీ స్థాయి సిబ్బందిని ఎంపిక చేయాలని చెప్పారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం జిల్లాలోని 12 మండలాలలో గల 102 గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో గ్రామాలలో పని చేసే ప్రతి శాఖకు సంబంధించిన సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామసభకు ముఖ్యంగా పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, విద్యా శాఖాధికారులు తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, ఇజల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్‌జోషి, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, పర్యటక శాఖ అధికారి అశోక్, మాస్టర్ ట్రైనర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వాగు దాటి కొడుకును ఆసుపత్రికి తరలించిన తండ్రి

### కల్వర్టు నిర్మించాలని గ్రామస్థుల డిమాండ్

### వాగు ఉప్పొంగడంతో రెండు రోజులుగా గ్రామానికే పరిమితం

**ఇంద్రవెల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు వరద నీటితో పొంగి పోర్లడంతో హార్కపూర్ అందుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని మామిడి గూడ ఎ, మామిడి గూడ జీ గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయి. మంగళవారం వరద నీరు తగ్గడంతో గ్రామ పటేల్ మెస్రం గంగారాం జ్వరంతో బాధపడుతున్న తన కొడుకు గురుప్రసాద్ ను భుజం పై ఎక్కించుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటి ఇంద్రవెల్లి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అదేవిధంగా వాగులో వరద నీటి కారణంగా రెండు రోజుల పాటు గ్రామంలో ఉన్న ఆదివాసీలు సహిత వాగు దాటి ఇంద్రవెల్లి మండలంలోకి వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. అధికారులు ప్రజాప్రతి నిధుల నిర్లక్ష్యం కారణంగా వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ 3.5 కోట్ల నిధులు మంజూరు చేసిన పనులు ప్రారంభించలేదని, దీంతో ఈ పరిస్థితి వచ్చిందని ఆ గ్రామస్థులు తెలిపారు. ప్రతి సంవత్సరం వర్ష కాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని.. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లలేక, ప్రాణాలు పోవాల్సిందేనని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మంజూరైన నిధులతో వాగు వద్ద కల్వర్టు నిర్మించి వచ్చే సంవత్సరంలోనైన ఈ పరిస్థితి రాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.త

### భారీ వర్షాల నేపథ్యంలో

## నేడు విద్యా సంస్థలకు సెలవు

**ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నేడు ఆదిలాబాద్ జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థుల రవాణా, ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయం కావడం, చెరువులు, ప్రాజెక్టులు నిండిపోవడం, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణించడం కష్టసాధ్యమని పేర్కొన్నారు. నేడు సెలవు అమల్లో ఉంటుందన్నారు.

### ముధోల్‌కు 45.15 కోట్లతో

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు

**ముథోల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**



ముధోల్‌లో 45.15 కోట్ల రూపాయల నిధులతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. గతంలో ఇక్కడ ఐటీఐ కళాశాల (టెక్నాలజీ సెంటర్) మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రిని కోరడంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావించడంతో ముధోల్‌లో ఏటీసీ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. కార్మిక, ఉపాధి కల్పన ఆధ్వర్యంలో టాటా టెక్నాలజీ భాగస్వామ్యంతో కేంద్రం కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగ యువత శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తారన్నారు. ఏటీసీ ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. 45 కోట్ల నిధులతో భవన నిర్మాణాలు, యంత్రాలు, కంప్యూటర్ లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి టాటా కంపెనీకి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

## కొమురం భీం ప్రాజెక్టుకు జలకళ

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. రెండు నుంచి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో కొమురం భీం ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరింది. దీంతో మంగళవారం ఉదయం అధికారులు ప్రాజెక్టులోని 4 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు. ప్రాజెక్టు నీటి మట్టం 243 మీటర్లు కాగా.. ప్రస్తుతం 237.20 మీటర్లకు చేరటంతో అధికారులు ప్రాజెక్టు 1.00 మీటర్లు మేర 4 గేట్లు ఎత్తి 8.077 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం వరకు మరికొన్ని గేట్లు ఎత్తి మళ్లీ నీరు విడుదల చేసే అవకాశం ఉంది. దిగువ ప్రాంతాల్లో గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.








# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

**కడెం ప్రాజెక్టును పరిశీలించిన ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**కడెం, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదనీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఇప్పటికే 9 కోట్ల రూపాయల నిధులతో మరమ్మతు పనులు పూర్తిచేశామని వెల్లడించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు, గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భారీ వరదల కార



ణంగా పంట పొలాలు, నివాస గృహాలు, రహదారులు నష్టపోయాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం సంబంధిత శాఖలు సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతాయని, అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. వరద నీటిలో కొట్టుకుపోయిన ఒక మత్స్యకారుని కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి అన్నారు. కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపడతామని వెల్లడించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సమాచారం అందించాలని, అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వాగులు, నదులు, ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల,



ఎమ్మెల్సీ దండేవిట్టల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నాకళ్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.






# వరద బాధితులకు అండగా ప్రభుత్వం

**తక్షణ సహాయం అందేలా చర్యలు - భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి**

**తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి ఆదేశం**

**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కురుస్తున్న నిరంతర భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షపాతం కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న వాగు ప్రాజెక్టుల నుండి నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలను ముందుగానే సమాచారం ఇచ్చి రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లవద్దని గ్రామాల వారీగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, నివాస గృహాలు దెబ్బతిన్న నేపథ్యంలో సంబంధిత శాఖలు తక్షణమే సర్వే చేసి నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనల మరమ్మత్తులను నాణ్యతతో పునర్నిర్మించేలా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే వరదల కారణంగా నీట మునిగిన వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలను తక్షణమే సర్వే చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య శాఖ అధికారులు తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే చేపట్టి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టంచేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మండలాల వారీగా, శాఖల వారీగా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఫోటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.సమావేశంలో ఎమ్మెల్సీ దండె విట్టల్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# కల్వర్టులు, వాగులను పరిశీలించిన కలెక్టర్

- ప్రజలకు అందుబాటులో అధికార యంత్రాంగం
- నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మందమర్రి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

వారం రోజుల నుండి జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలోని వాగు, కల్వర్టు ప్రాంతాలను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటూ తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అందుగులపేట గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న కల్వర్టు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో మురుగు కాలువలు, రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, వాగులలో వరద ఉధృతిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మురుగునీటి కారణంగా దోమల వృద్ధి ని అరికట్టేందుకు నీటి నిలువలను ఎప్పటికప్పుడు తొలగించాలని, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ పిచికారి చేసి దోమల వృద్దిని నిరోధించాలని, సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. తాగునీటి కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించేందుకు క్లోరినేషన్ చేయాలని, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాగులు, నది, చెరువులలో వర్షపు నీరు అధికంగా ఉన్నందున చేపల వేటకు వెళ్లకూడదని, వరద పరిస్థితులలో పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు టామ్ టామ్ ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. మీడియా ప్రతినిధులు ప్రజలలో నెలకొన్న ఆందోళన తొలగించే విధంగా వాస్తవ కథనాలను తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో మరో 24 గంటలు వర్ష సూచన ఉందని, జిల్లాలో దెబ్బతిన్న నివాస గృహాల వివరాలతో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించడం జరిగిందని, పొలాల్లో ఉన్న వరద నీరు తగ్గిన తర్వాత పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాగులు, నది వద్దకు ఎవరు వెళ్లకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. అత్యవసర సేవలు అందించేందుకు 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, రక్షణ పరికరాలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.





### చవితి ఉత్సవాలు శాంతియుతంగా
# నిర్వహించుకోవాలి

**నార్నూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని నార్నూర్ సీఐ పేందోర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని రాజుల్ గూడ ఫంక్షన్ భవనంలో పీస్ ఫుల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వహకులు చూడాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. వినాయకుని ప్రతిష్టాపించే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు చోటు చేసుకుంటే తక్షణమే 100 డయల్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ ఎస్సై అఖిల్, మాజీ సర్పంచ్ బానోత్ గజానన్ నాయక్, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి దుర్గపటేల్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ ఉన్నారు.



## వృద్ధ ఆశ్రయంలో ఫొటోగ్రాఫర్ల అన్నదానం

**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రియదర్శిని నగర్ లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు నిర్మల్ ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్ర పటానికి సంఘ సభ్యులంతా నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.




# శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : రాథోడ్ రవీందర్

**నార్నూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ రాథోడ్ రవీందర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం లోకారికే గ్రామంలో ఝరి ప్రభుత్వ దవాఖాన వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్ ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండడంతో వీధులలో అపరిశుభ్రత లోపించి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉంటాయన్నారు. స్థానికులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. అపరిశుభ్రత లోపించకుండా చూడాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణతో పాటు గర్భిణులకు పలు సూచనలు చేశారు. మాతా శిశు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని, ప్రతినెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవం సురక్షితంగా ఉంటుందని తెలిపారు. గ్రామాలలో చిన్నపాటి జ్వరం వచ్చిన హాస్పిటల్‌ను ఆశ్రయించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్ సుభద్ర తదితరులు ఉన్నారు.





### ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై నుంచి
# రాకపోకలు బంద్

**మంచిర్యాల, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట గోదావరి నది పైన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పైన నుంచి రాకపోకలను నిలిపి వచ్చినట్లు హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండే, ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షలకు ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటతో 35గేట్లను ఎత్తి 3,41,775 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### వైద్య శిబిరాలను
# సద్వినియోగం చేసుకోవాలి

**నార్నూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ముక్తాపూర్ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో బయటికి వెళ్లాలన్నారు. అలాగే ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, అపరిశుభ్రత లోపించడంతో వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉంటాయన్నారు. పరిశుభ్రతతో పాటు కాచిన వేడి నీటిని తాగాలన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్వైజర్ చరణ్ దాస్, సత్యవ్వ, వైద్య సిబ్బంది గణేష్ కుమారి, సింధు, కైలాస్, ఈశ్వర్, దినేష్, ఆశ కార్యకర్తలు భీం బాయి, శ్రీలత, అనిత తదితరులున్నారు.



# నా భర్త భూమి నాదే కాదు అంటున్నారు.. వృద్ధురాలు జనుప మల్లమ్మ ఆవేదన

**కాసిపేట, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

నా భర్త భూమి నాది కాదు అంటున్నారని, నాకే సంబంధం లేదని తప్పుగా ప్రచారం చేస్తున్నారని, నాపై దాడి చేసి ఇంట్లో నుంచి వెళ్లగొట్టి భూమిని లాక్కుంటున్నారని, నాకు న్యాయం చేయాలని జనుప మల్లమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వృద్దురాలు జనుప మల్లమ్మ తన కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి తన ఆవేదన వ్యక్తం చేసింది. వృద్దురాలు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కాసిపేట గ్రామ పంచాయతీ శివారులోని 213 సర్వే నెంబర్ లో గల రెండు ఎకరాల భూమి తన భర్త భూమయ్య పేరు ఉండగా భర్త చనిపోవడంతో కొడుకు జనుప రాంచందర్ పేరుపై పత్రాలు చేసుకున్నారన్నారు. కొడుకు చనిపోవడంతో కోడలు జనుప అల్లిక నాపై దాడి చేసి నా ఇంట్లో నుంచి వెళ్లగొట్టిందన్నారు. వృద్ధురాలైన నన్ను కనీసం పట్టించుకోవడంలేదని, ఇంట్లోకి రానిస్త లేదని కన్నీరు మున్నీరయ్యారు. నా భర్త భూమి నాకు హక్కు ఉందని, కానీ కోడలు కొంత మందితో కలిసి నన్ను కొట్టి నా ఇంట్లోకి రానిస్తలేదన్నారు. మా భూమిని వేరే వాళ్ళతో కలిసి మొత్తం తీసుకోవాలని చూస్తుందని, భూమి మొత్తం తీసుకుంటే నేను ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేసింది. లంక లక్ష్మణ్, కుర్మ నర్సయ్య అనే గ్రామ పెద్ద మనుషులు నా తరుపును న్యాయం కోసం ఎవరు మాట్లాడినా వారిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నన్ను ఎవరూ పట్టించుకోవడం లేదని, నాకు జీవన ఆధారం లేదని, దీని కారణంగా నా భర్తకు సంబంధించిన భూమి విషయంలో సీనియర్ సిటీజన్ యాక్ట్ ప్రకారం నాకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ సమావేశంలో కూతురు గౌరి భాగ్య లక్ష్మీ, గొడిసెల బాలయ్య, నిచ్చకోల పోషం తదితరులు పాల్గొన్నారు.





# విద్యారంగ అభివృద్ధికి చర్యలు

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి
- ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలి
- భోజనానికి తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులను మాత్రమే వినియోగించాలి
- విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలి
- అదనపు కల్టెర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని అదనపు కల్టెర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను మంగళవారం సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, ప్రయోగశాల, వంటశాల, పారిశుధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్నందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వర్చువల్ రియాలిటీ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని తెలిపారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని సూచించారు. వర్షాకాలం అయినందున వ్యాధులు వ్యాప్తిని నిరోధించే విధంగా వ్యక్తిత పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించాలని తెలిపారు. పాఠశాలలో చేయాల్సిన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జన్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని భవిత కేంద్రాన్ని సందర్శించి రికార్డుల పరిశీలన, విద్యార్థుల నమోదు వివరాలతో పాటు నూతనంగా నిర్మిస్తున్న భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రం ద్వారా విద్యాబోధన కొనసాగుతుందని అన్నారు. నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరిగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



## అంధకారంలో కుభీర్‌లోని వివేకానంద చౌక్

**కుభీర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రం కుభీర్‌లోని ప్రధాన కూడలి (చౌక్) గత కొన్ని నెలలుగా అంధకారంలో మగ్గుతోంది. పట్టించుకునే నాథుడు లేక ప్రజలు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఈ కూడలి అత్యంత ప్రధానమైనది. కుభీర్‌తో పాటు కస్ర, కస్ర తండా, రాజురా జుండా, పార్డి (కే), పార్డి (కే) తాండ, పల్సి, పల్సితాండాల ప్రజలు ఈ చౌక్ లోనే బస్సు దిగి వారి వారి గ్రామాలకు వెళ్తుంటారు. చాలామటుకు బైంసాతో పాటు నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, నాందేడ్ పట్టణాలకు ఆసుపత్రులకు వెళ్లి నైట్ హాల్ట్ బస్సు, కుబీర్ వరకు వివిధ ప్రైవేట్ వాహనాల్లో వచ్చి ఇక్కడే దిగి వారి వారి గ్రామాలకు వెళ్తుంటారు. ఈ చౌక్‌లో కొన్ని నెలలుగా హైమాస్ట్ లైట్లు వెలగగా పోవడంతో వీధి కుక్కలు పలువురు ప్రయాణికుల మీద దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ బస్సు దిగిన ప్రయాణికులు చౌక్‌లో వారి ఇంటి నుండి ద్విచక్ర వాహనం, ఆటో వచ్చే వరకు వేచి ఉండాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. కుభీర్ మేజర్ పంచాయతీ అధికారులకు పలువురు ఈ విషయమై విన్నవించినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై మోహన్ సింగ్‌ను వివరణ కోరగా కుభీర్ పంచాయతీ కార్యదర్శికి చెప్పి మరమ్మతులు చేయిస్తానన్నారు.

## ఇంచార్జీ మంత్రి జూపల్లిని కలిసిన బోథ్ పార్టీ కాంగ్రెస్ శ్రేణులు

**బోథ్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిశారు. గత 3 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను, ఇళ్లను పరిశీలించడానికి మంగళవారం జిల్లాకు వచ్చిన మంత్రిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ పార్టీ నాయకులతో కలిసి స్వాగతం పలికారు. బోథ్ నియోజకవర్గంలో తాజా పరిస్థితులపై జిల్లా ఇన్చార్జి మంత్రికి నియోజకవర్గలో జరికిన నష్టాన్ని వినతిపత్రం అందజేశారు. బోథ్ నియోజకవర్గంలో చాలా మేరకు రైతులు నష్టపోయారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ తెలిపారు.



## కొనసాగుతున్న ఆదివాసీల నిరహార దీక్ష



**తాండూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గిరిజన గ్రామాల పరిధిలో హైలెవెల్ వంతెనలు, రోడ్లు నిర్మించాలని ఆదివాసీ సంఘం నాయకులు తాండూర్ తహశీల్ కార్యాలయం ముందు చేపట్టిన నిరహార దీక్ష మంగళవారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షుడు కుర్సెంగ బాబురావు మాట్లాడుతూ సింగరేణి ప్రధాన రహదారి సమీపంలోని చెక్ పోస్ట్ నుంచి నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 13 గ్రామాలకు వెళ్ళే రహదారిలో భీమన్నవాగు బ్రిడ్జి కృంగి పోవడంతో అక్కడ నూతన బ్రిడ్జి మంజూరు చేయాలని, లచ్చుగూడ వద్ద రోడ్ డ్యాం నిర్మించాలని, నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి బెజ్జాల వరకు ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చేదాక ఈ దీక్షను కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు సోయం సురేష్, తుమ్రం జంగు, కుర్సెంగ లచ్చు, ఆత్రం మనోహర్, కుర్సెంగ సాయి కుమార్, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది. అలాగే నర్సాపూర్ గ్రామం వద్ద భీమన్న వంతెనను బీజేపీ, బీజేవైఎం నాయకులు సందర్శించి హై లెవెల్ వంతెనను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



## అటవీ భూములను ఆక్రమించొద్దు

### సరైన ఆధారాలు ఉంటే సహకరిస్తాం..
### భూములను ఖాళీ చేసి వెళ్లిపోవాలి
### తహసీల్దార్‌మనోహర్ రెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీధర్

**జన్నారం, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ భూములను ఆక్రమించడం సరికాదని మండల తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఎఫ్ ఆర్ వో శ్రీధర్ ఆచారి అన్నారు. మంగళవారం మండలంలోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇంధన్ పల్లి రేంజ్, కవ్వాల్ సెక్షన్ అటవీ ప్రాంతంలో ఉన్న పాల గౌరీ అటవీ భూముల్లో జైనూర్ సిర్పూర్ మండలాలకు చెందిన గిరిజనులు వచ్చి గుడిసెలు వేసుకున్న సందర్భంగా ప్రదేశానికి వెళ్లి వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల వద్ద ఎలాంటి ఆధారాలు ఉన్నా, రికార్డు కాగితాలు ఉన్న తమకు చూపిస్తే తగిన సహకారం అందిస్తామని వారికి తెలిపారు. కానీ అనవసరంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి అడవులను నరుకుతామంటే ఊరుకునే సమస్య లేదని ఇది సరైంది కాదని వారికి విన్నవించారు. ఆ ప్రదేశాన్ని ఖాళీ చేసి తమ పాత ప్రదేశానికి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ ఆర్ఐ భాను చందర్ ఇతర అటవీశాఖ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

రైతులకు ఎరువులు, మందులను అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్ షాప్ ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, ఈ-పాస్ యంత్రం, ధరల పట్టిక, స్టాకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అడిగిన మందులను నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించాలని, అదనంగా మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు చేసిన అంశాలకు సంబంధించి రైతులకు నగదు రసీదును రైతులకు అందించాలని తెలిపారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలను పాటిస్తూ, పంట మెలకువలు తెలుసుకుని, యూరియా, ఇతర మందులను మోతాదు ప్రకారం పిచికారి చేయాలని, అధిక దిగుబడి పొందాలని తెలిపారు. మందులను మోతాదుకు మించి వినియోగించకూడదని, మందులు కొనుగోలు చేసిన రసీదులను రైతులు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం యూరియా, సాగుకు అనుకూలంగా పంపిణీ చేస్తుందని, రైతులు అవకాశాన్ని వినియోగించుకుని పంట సాగు చేయాలన్నారు.



## కుక్కల బారి నుండి జింకను కాపాడిన యువకుడు

**సిర్పూర్ (టి), ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**

సిర్పూర్ (టి) మండలంలోని హుడ్కిలి గ్రామానికి చెందిన కిర్మరే తరుణ్ అనే యువకుడు కుక్కల బారిన పడిన ఓ జింకను కాపాడారు. మంగళవారం హుడ్కిలి గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కల గుంపు తరుముకుంటూ గాయపరిచింది. తరుణ్ కుక్కలను తరిమివేసి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు జింకకు ప్రథమ చికిత్స చేసి అడవిలో వదిలేశారు. తరుణ్‌ను అధికారులు అభినందించారు.



# పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆశా వర్కర్ల ఆందోళన

**తాండూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో సీఐటీయూ నాయకులు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్సీల ముందు ఆశా వర్కర్లతో కలిసి ధర్నా చేపట్టామని అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.18 వేల ఫిక్స్ వేతనం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం వెంటనే హామీలు నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం హాస్పిటల్ సిబ్బంది లక్ష్మీప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు కవిత, రాజేశ్వరి సావిత్రి, సునీత, భాగ్య, చంద్రకళ, భారతి, అనురాధ, జయ, మల్లీశ్వరి లక్ష్మి, సంధ్యారాని, నర్సుబాయి, మంజుల, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.





### టీఎల్ఎం మేళాతో
## బోధన సులభతరం

**నెన్నెల, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు సులభతరంగా భోదన చేయడానికి ఉపాధ్యా బోధనోపరణాల మేళాలు ఎంతో ఉపయోగ పడుతాయిని మండల విద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం ఆవడం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎల్ఎం మేళాతో పిల్లలకు సులభతరంగా బోధన చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మేళాలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు పిల్లల మనస్సులో నిలిచిపోతాయన్నారు. రేఖాచిత్రాలు, బొమ్మలు, విత్తనాలు, కాగితాలు, వివిధ వస్తువులతో తయారు చేసి ఏర్పాట్లు చేసారని వాటిని విద్యార్థుల మధ్య ప్రదర్శించరన్నారు. ఇక్కడ ప్రదర్శించిన ఎగ్జిబిట్లలో ప్రతిభ కనబర్చిన వాటిని మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా మొదటి బహుమతి వచ్చేలా టీచర్లు అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అవుడం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, డిఆర్పి ఖాదర్ పాల్గొన్నారు.

### ఖానాపూర్ ప్రెస్ క్లబ్
## నూతన కార్యవర్గం ఎన్నిక



**ఖానాపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ సీనియర్ ప్రెస్క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పడాల లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులుగా రాచ మల్ల రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్గా సిరిపురం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కోమటిపల్లి వేణు గోపాల్, కోశాధికారిగా మదిరె శ్రీనివాస్, సహ కోశాధికారిగా అమంద శంకర్, గౌరవ ముఖ్య సలహాదారుగా కారింగుల వెంకటేశ్వర్లు, సమన్వయకర్తగా దేవేందర్, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

### కాలనీలలో అభివృద్ధి
## పనుల కోసం మంత్రికి వినతి



**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
తాజా మాజీ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా ఖాన్, తమ వార్డులోని టీచర్స్ కాలనీ, గాజులపేట, గంజ్ బక్ష్, యాహియ కాలనీలలో సిసి రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

### భారీ వర్షాల నేపథ్యంలో
## నేడు విద్యా సంస్థలకు సెలవు



**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నేడు నిర్మల్ జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థుల రవాణా, ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయం కావడం, చెరువులు, ప్రాజెక్టులు నిండిపోవడం, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణించడం కష్టసాధ్యమని పేర్కొన్నారు. నేడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఒకరోజు సెలవు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 9100 577132లో సంప్రదించవచ్చని తెలిపారు.

### బెల్లంపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ,
## విశ్వకర్మ నూతన కమిటీ

**బెల్లంపల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కమిటీని మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా అక్కెనపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జన్నం సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీ రామోజీ లక్ష్మణాచారిలను ఎన్నుకున్నారు. వీరి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులను ఖరారు చేశారు. నేడు పట్టణంలోని హనుమాన్ మందిర్లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ మహా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సభకు నియోజక వర్గంలోని విశ్వబ్రాహ్మణ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బెల్లంపల్లి మండల విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ మడుపు రవికుమార్ కోరారు.





### పాఠశాలలో అభ్యసన
## కార్యక్రమాలు నిర్వహించాలి

**ఖానాపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
పాఠశాలలో అభ్యాసన కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. కడెం మండలంలోని అంబర్ పేట ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల యొక్క బోధన డైరీ లను తనిఖీ చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు బోధన డైరీలు రాయాలని పాఠ్య ప్రణాళిక ప్రకారం తరగతులు బోధించాలని, అన్ని తరగతులకు అభ్యసనా కార్యక్రమాలు నిర్దేశించిన విధంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు, బేస్లైన్ పరీక్షలు నిర్వహించడం, అన్ని వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యార్థులకు శుభ్రమైన నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించడం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మొదలు అంశాల గురించి వివరించారు.

### బ్రిడ్జిపై నుండి బోల్తా పడ్డ
## వాహనం.. ఒకరు మృతి

**బోథ్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
బ్రిడ్జి పై నుండి వాహనం బోల్తాపడి ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని కుప్టి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాగ్పూర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఐచర్ కంటెయినర్ వాహనం నేరడిగొండ మండల కేంద్రంలోని కుప్టి వంతెన వద్ద అదుపు తప్పి వంతెన పై నుండి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనువతే అనిల్ (38) క్యాబిన్ లోనే ఇరుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బైటికి తీసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.






# ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయురాలికి అవార్డు




**జన్నారం, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
2022, 2023 సంవత్సరాలలో ఉర్దూ ఉపాధ్యాయులుగా విశేష సేవలు అందించిన వారికి తెలంగాణ ఉర్దూ అకాడమీ ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుల అవార్డులను అందించడం జరిగిందని, ఈ క్రమంలో జిల్లాలోని జన్నారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్గా పని చేస్తున్న రజియా భాను అవార్డు పొందారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 173 మంది ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని పొందారని, నిబద్ధతతో పని చేసి సేవలు అందించిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం జరిగిందన్నారు. హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ల చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు 25 వేల రూపాయల నగదు బహుమతి అందించారని తెలిపారు. రజియా భాను పాఠశాలలో నాణ్యమైన ఉర్దూ బోధనతో పాటు విద్యార్థుల భాష నైపుణ్యాలు, సాంస్కృతిక విలువలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని, పిల్లల సంరక్షణ కొరకు చైల్డ్ కేర్ కార్యక్రమాలు నిర్వహించి, తాత్కాలిక భవనాల స్థానంలో శాశ్వత భవనాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు.




# భూభారతిలో భూ సమస్యల పరిష్కారంలో సర్వేయర్లదే కీలక పాత్ర

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025 రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడంలో సర్వేయర్లదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ బ్యాచ్ లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి భూ కొలతల శాఖ అధికారి శ్రీనివాస్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చట్టాన్ని ప్రవేశపెట్టి రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించిన జరిగిందని, ఈ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, ఈ ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని తెలిపారు. 1971లో ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో భూ రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం తో ఇనాం, సీలింగ్ చట్టం ప్రవేశపెట్టి ఒకే సర్వే నెంబర్ లో పెద్ద మొత్తంలో భూ విస్తీర్ణం కలిగిన భూస్వాముల నుండి 10 ఎకరాలు సీలింగ్ చట్టం క్రింద తీసుకోవడం జరిగిందని తెలిపారు. టేనేంట్ యాక్ట్ క్రింద భూస్వాముల నుండి లీజుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలుదారుకు హక్కు కల్పించి సీలింగ్ నుండి పట్టా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఒకే సర్వేనెంబర్ పట్టా, సీలింగ్, కాంప్లికేషన్ రకాల భూములను గుర్తించి రికార్డుల ప్రకారం చర్యలు తీసుకునేవారని, 1973 -74 నుండి రెవెన్యూ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత 100 ఎకరాలలో 10 ఎకరాలు సీలింగ్ పట్టా చేయడం జరిగిందని తెలిపారు. సర్వేయర్లు దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, సీలింగ్ భూమిని గుర్తించాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని తెలిపారు. ప్రస్తుతం వచ్చే దరఖాస్తులను రిజిస్ట్రేషన్, మార్పులు, భూధార్ గుర్తింపు, ఇతర ఆధారాలను పరిశీలించి సీలింగ్, పట్టా, 38-ఈ, ప్రభుత్వ భూములను గుర్తించాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని తెలిపారు. పట్టాదారులు తమ భూమి అభివృద్ధి సమయంలో రోడ్లకు కొంత భూమిని కేటాయించాలని, ఈ విషయంపై పట్టాదారులకు వివరించాలని, దరఖాస్తు సమయంలో వివరాలను పూర్తిగా పరిశీలించాలని తెలిపారు. మొదటి విడతలో ఎంపికైన 162 మంది లైసెన్స్ డ్ సర్వేయర్లకు శిక్షణ అందించి, 2వ విడతలో 169 మందికి శిక్షణ అందించడం జరుగుతుందని, సర్వేయర్లు శిక్షణలో చట్టంలోని పూర్తి వివరాలు తెలుసుకోవాలని, తమ విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని, అసలైన పట్టాదారులు, ప్రభుత్వ భూములను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభమయ్యేందుకే ఈ మేళాలు

### ఎంఈఓ బోనగిరి శ్రీనివాస్

**జైపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా ఈ మేళాలు దోహదపడుతాయని మండల విద్యాశాఖ అధికారి బోనగిరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బోధన అభ్యాసన సామగ్రి మేళాను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, చౌదరి, తహసిల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఎస్ఐ శ్రీధర్ కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బోధన అభ్యాసన సామగ్రి ఉపాధ్యాయులకు దిక్సూచి వంటిదని, విద్యార్థులు నిత్య జీవితంలో కూడా వినియోగించు కోగలిగేలా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా రూపొందించారని అన్నారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్, పర్యావరణ అధ్యయనాల్లో ఉపాధ్యాయులు రూపొందించిన చార్టులు, బోధన సాధనాలను పరిశీలించారు. న్యాయ నిర్ణేతలు పవన్, సత్యయ్య, పద్మజ, రత్నాకర్, హేమలత, రవీందర్, రమేష్ బాబు, సత్తిరెడ్డి వ్యవహరించగా విజేత పాఠశాలలకు అభినందన సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

# పరవళ్ళు తొక్కుతున్న ఉల్లిపిట్ట జలపాతం

**తిర్యాణి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం జిల్లా తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట జలపాతం పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో జలకళ సంత రించుకుంది. దీంతో సందర్శకులను జలపాతం విశేషంగా ఆకర్షిస్తోంది. పచ్చని కొండల మధ్య నుంచి ఎత్తైన ప్రదేశం నుంచి కిందకి దూకుతున్న జలధార అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తోంది. జలపాతం నిండుగా పారుతుండడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు జలపాతం అందాలను తిలకించడానికి తరలివస్తున్నారు. పెరుగుతున్న ప్రవాహంతో జలపాతం మరింత ఆకర్షణీయంగా మారింది.



# శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులను జరుపుకోవాలి



**బెల్లంపల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులను జరుపుకోవాలని బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు కోరారు. మండపాల వద్ద భద్రత, బందోబస్తు కోసమే నిర్వాహకులు ఆన్లైన్ విధానంలో వివరాలు నమోదు చేసుకోవాలని చెబుతున్నట్లు చెప్పారు. పోలీసు శాఖ ఆన్లైన్ విధానం ద్వారానే మండపాలకు అనుమతి మంజూరు చేస్తుందన్నారు. https://police portal.tspolice.gov.in ఆన్లైన్ లింకును క్లిక్ చేసి అందులో దరఖాస్తుదారులు వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రాంతం, పోలీస్ స్టేషన్ పరిధి, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, విగ్రహం ప్రతిష్టించే రోజు, నిమజ్జనం చేసే సమయం, అందుకు వాడే వాహనం వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. గణేష్ మండపాలు ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వాడాలన్నారు. శోభాయాత్ర సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేను వాడవద్దని కోరారు.



## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
ఆశా వర్కర్లకు జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని ఆగస్టు నెల పారితోషికాలు ఆలస్యం చేయకుండా గతంలో చెల్లించినట్టు సకాలంలో చెల్లించాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఈ విషయమై మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆశ వర్కర్స్ యూనియన్ ఆశాలతో కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఆశా వర్కర్లకు నేటికి జూలై నెల పారితోషికాలు రాలేదని, నేటికీ పారితోషికాలు రాకపోవడంతో ఆశా వర్కర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఉన్న అధికారులు ఆశా వర్కర్ల పారితోషికాలను ప్రతి నెల ముగింపు లోపు చెల్లించేవారని కానీ ఇప్పుడు ఆశా వర్కర్లకు పారితోషికాలు గతంలో చెల్లించినట్లు సకాలంలో రావడం లేదన్నారు. దీంతో ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. కావున జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని, భవిష్యత్తులో ఈ విధంగా ఆలస్యం జరగకుండా ప్రతి నెల ముగింపు లోపు చెల్లించాలని, ఆగస్టు నెల పారితోషికాలు సకాలంలో చెల్లించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు మట్టి ఖర్చులు రూ.50 వేలు చెల్లిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. డిసెంబర్ 10న ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని 6 నెలలు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. ఆశాలు చేస్తున్న పారితోషికం లేని పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, లక్ష్మీ, హారిక ఉన్నారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

**లక్సెట్టిపేట, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
రైతులను వ్యాపారులు ఇబ్బందులు పెడితే సహించేది లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రునాయక్ అ న్నారు. మంగళవారం లక్సెట్టిపేట పట్టణంలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు తమ దగ్గర ఉన్న స్టాక్ వివరాలను నోటీసు బోర్డుపై ప్రతి రోజు పెట్టాలని ఏరోజుకు ఆరోజు అప్డేట్ చేస్తు ఉండాలన్నా రు. రైతులు కూడా వాళ్ల అవసరాలకు మాత్రమే ఎరువులను తీసుకోవాలని ఒకే సారి ఎక్కువ మోతాదులో తీసుకుంటే మిగిలిన రైతులు ఇబ్బంది పడతారన్న విషయం గమనించాలన్నారు. యూరియాను కూడా రైతులు అధిక మోతాదులో వాడితే పంటలకు చీడపీడలు వచ్చే ప్రమాదం ఉంటుందన్న విషయం గమనించాలన్నారు. ఇటిక్యాల, జెండవెంకటాపూర్, గుల్లకోట సహ కార సంఘాల ద్వారా ఇప్పటికే సుమారు 300టన్నుల యూరియాను పం పిణీ చేశామని అన్నారు. ఈతనితోపాటు సహాయ వ్యవసాయ సంచాలకులు గోపి, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్, ఉన్నారు.





# ఎన్నో మధుర జ్ఞాపకాలకు నిదర్శనమే ఫోటో

**ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** మన జీవితంలోని ఎన్నో మధుర జ్ఞాపకాలకు నిదర్శనంగా నిలిచేదే ఫోటో అని, ఈ ఫోటో కదలని చిత్రమైనప్పటికీ మనిషి మనసును కదిలిస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంక ర్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పురస్కరించుకొని ఆదిలాబాద్లో జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ సృష్టికర్త లూ యిస్ డాగ్యురే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు బహుమతులు అంద జేశారు. దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఫోటోగ్రాఫర్లు తీసే చిత్రాలు పది కాలాలపాటు పదిలంగా నిలిచిపోతాయని, ఎప్ప టికీ గుర్తుండిపోయేలా, అందంగా కనిపించేలా వీడియోలు తీయడం ఫోటోగ్రాఫర్లకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, విజయ్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు దొడ అశోక్, హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా గౌరవ సలహాదారులు అనిల్ దేశ్పాండే పాల్గొన్నారు.



## గణపతి మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**మంచిర్యాల, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని అగ్నిమాపక అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక స్నేహ ఇన్కన్వెన్షన్ హాలులో నిర్వహించిన గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మా ట్లాడారు. గణపతి మండపాల వద్ద ఎలాంటి పొర పాట్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. ప్రతి మండపం వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం మండపాల నిర్వాహ కులు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో గతుకుల రోడ్లు ఉండడం, వర్షాల వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనుల ను చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్, ఇతర సా మగ్రిని మండపాల వద్ద ఉంచాలన్నారు. హిందూ ఉత్సవ సమితి పట్టణాధ్యక్షుడు రాజ్కిరణ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, హరికృష్ణ, మండపాల నిర్వా హకులు పాల్గొన్నారు.

## గల్లంతైన మృతదేహం లభ్యం

**కడెం, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు గేట్లు ఇరగడంతో కడెం నదిలో చేపలు పట్టడానికి వెళ్లిన కన్నాపూర్కు చెందిన గంగాధర్ వరద నీటిలో గల్లంతు కాగా మృతదేహం బుధవారం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాల సహాయంతో పోలీసు అగ్నిమాపక సిబ్బంది ఎన్డిఆర్ఎఫ్ సభ్యులు నది పరి వక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు.

# సిడిపిఓ అవినీతిపై విచారణ జరపండి

**ఖానాపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** ఖానాపూర్ ఐసిడిఎస్ సిడిపిఓ సరిత అనేక అక్రమాలకు పాల్పడిందని విచారణ లోతుగా నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు విచారణ జరుగుతున్న అధికారి నీ కలిసి వినతి పత్రం అందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి విచారణకు రాగా ఆమెకు వారు సిడిపిఓ అవినీతి అక్రమాలపై వినతిపత్రం అందించి చర్యలు తీసుకో వాలని ఆమెను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన కుమార్ నందిరామయ్య స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.



# ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల వినతి



**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అలాగే ఇందిరమ్మ పథకంలో ఇళ్ల నిర్మాణాలను చేప ట్టాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఈ సందర్భంగా కోరారు. దీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న ఈ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ విషయంపై వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ప్రెస్క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో విద్యార్థుల హాజరుపై దృష్టి సారించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు, ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, ఇన్చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యార్థుల హాజరుపై మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాఠశా లల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల హాజరుపై అధికారులు ప్రతి రోజు పర్యవేక్షిం చాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించాలని తెలిపారు.



## వాటర్ షెడ్ పథకంలో అవినీతిపై విచారణ జరపాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** జిల్లా వ్యాప్తంగా వాటర్ షెడ్ పథకంలో చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో మంగ ళవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయ కులు మాట్లాడుతూ... వాటర్ షెడ్ పథకంలో చేపట్టిన పనుల్లో ఇంటి దొంగలు ఉన్నారని తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోక పోవడం శోచనీయమన్నారు. అవినీతి అక్రమాలలో పాత్ర ఉన్న ఏపీఎం, సీసీల నుండి డబ్బులు రికవరీ చేయకుండానే డిఆర్డిఓ వారికి వత్తాసు పలుకుతూ సస్పెండ్ అయినవారికి మళ్ళీ పోస్టింగ్ ఇచ్చారని ఆరోపించారు. అవినీతిలో అందరి భాగస్వామ్యం ఉందని బహిరంగంగా చర్చ జరుగుతుందని తెలిపారు.

## నవోదయలో ప్రవేశాలకు గడువు పొడిగింపు
## డిసెంబర్ 13న రాత పరీక్ష

**కాగజ్నగర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** కాగజ్నగర్లోని నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు మరింత గడువు పొడిగించారు. ఈనెల 13న గడువు ముగిసింది. కాగా ఈనెల 27 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల క్రిష్ణ తెలిపారు. నవోదయల్లో అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంతో వారు దేశం లోనే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోదయ విద్యాలయా ల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశా లకు దరఖాస్తులను చేసుకొని భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అలాగే 9, 11 తరగతుల్లో కూడా ఖాళీ సీట్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సీట్లకు కూడా విద్యార్థులు దరఖాస్తులు వె బ్సైట్ ద్వారా చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ సూచించా రు. కాగజ్నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి లో 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 సీట్లు గ్రామీణ ప్రాంతాల వారికి 20 సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థు లకు కేటాయిస్తారు. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లకుగాను ఉమ్మడి జిల్లా నుంచి గతేడాది 5900 దరఖాస్తులు వచ్చినట్లు విద్యాలయ అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు ఇప్పటికే మూడు సార్లు గడువు పొడిగించారు. జూన్ 13, జూలై 29, ప్రస్తుతం ఆగస్టు 27 వరకు గడువు తిరిగి పొడిగించారు. డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహి స్తారు. ఈసారి ఇంటర్నెట్ ద్వారా మరింత సులభతరం గా దరఖాస్తులను అప్లోడ్ చేసేవిధంగా మార్పులు చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.



# బాధిత రైతులను వెంటనే ఆదుకోవాలి

## నిరాశ్రయులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి - మాజీ మంత్రి జోగురామన్న

**ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరదలు వచ్చినప్పుడు టీపీసీసీ ప్రెసిడెంట్గా ఉన్న రేవంత్ రెడ్డి అప్పుడు చెప్పిన మాటలను ఇప్పుడు సీఎంగా ఎందుకు అమలు చేయడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సీఎంగా కొనసాగుతున్న సమయంలో వరదలు వస్తే టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డి పంట నష్టపోయిన రైతులకు రూ.10,000 ఏమి సరిపోతాయని, ఎకరానికి రూ. 25 వేలు, మిర్చి రైతులకు రూ. 50 వేలు ఇచ్చే వరకు రైతు ల పక్షాన పోరాడుతాం అని, ఆనాడు సీఎం కేసీఆర్ కు లేఖ రాసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆయనే స్వయంగా సీఎంగా ఉన్నప్పుడు అప్పుడు చెప్పిన నష్టపరియారాన్ని ఇప్పుడు ఎందు కు అందించడం లేదని మాజీ మంత్రి రామన్న మంగళ వారం మీడియా ద్వారా ప్రశ్నించారు. టీపీసీసీగా ఉన్నప్పుడు చెప్పిన మాటలు సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదంటే ఆయన పక్కా జూటే బాత్ సీఎం అని ఎద్దేవ చేశారు. ఆనాడు సీఎంగా కేసీఆర్ నష్టపరిహారం అం దించిన రూ. 10 వేలనే నేటి సీఎం కొనసాగించడం కాం గ్రెస్ ప్రభుత్వ తీరుకు నిద ర్శనమన్నారు. నష్టంపై త్వరలో సర్వే చేయించి, బాధిత రైతులను ప్రజలను వెంటనే ఆదు కోవాలని రామన్న డిమాండ్ చేశారు.




## ప్రభాస్ 'ఫౌజీ' లుక్

రెబల్ స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. బాహుబలి లాంటి పాన్ ఇండియా సినిమా తర్వాత ఆయన రేంజ్ పెరిగిపోయిన విషయం తెలిసిందే. అప్పటినుండి వరుసగా భారీ బడ్జెట్ సినిమాలే చేస్తున్నారు. కల్కి, సలార్ వంటి చిత్రాలు భారీ బడ్జెట్ తో రూపొంది బాక్సఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. ఇక రాబోయే చిత్రాలు కూడా అన్ని భారీ బడ్జెట్ సినిమాలు కావడం విశేషం. అందులో సందీప్ రెడ్డి వంగా తో 'స్పిరిట్', అలాగే హను రాఘవపుడితో 'ఫౌజీ' మూవీస్ ఉన్నాయి. అయితే ప్రభాస్ నటించిన ఏ సినిమా గురించి అయినా చిన్న అప్డేట్ వచ్చినా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటం కామన్. తాజాగా ఆయన చేస్తున్న కొత్త సినిమా "ఫౌజీ"కి సంబంధించిన లుక్స్, సెట్స్ నెట్టింట్లో హల్‌చల్ చేస్తున్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇటీవలే ప్రభాస్, కన్నప్ప సినిమాలో "రుద్ర" పాత్రలో కనిపించి అభిమానులను అలరించారు. ఇప్పుడు ఫౌజీ సినిమాలోని ఆయన సైనికుడి పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమా కి సంబంధించి ప్రభాస్ లుక్ ఒకటి తాజాగా లీక్ అయ్యింది. ఈ లుక్ చూసి అభిమానులు డార్లింగ్ వింటేజ్ లుక్ లో అదిరిపోయాడంటూ ఆనందపడిపోతున్నారు.ఇక ఈ సినిమా కథ 1940ల బ్రిటీష్ పాలనలో ఉన్న భారతదేశాన్ని ఆధారంగా తీసుకుని రూపొందుతోంది. ప్రపంచ యుద్ధం నడుస్తున్న సమయంలో జరిగే ఓ సైనికుడి ప్రేమకథ ఇది. అందుకే ఈ సినిమాలో దేశభక్తి, యుద్ధం, ప్రేమ అనే మూడు ప్రధాన అంశాలను డైరెక్టర్ హను చాలా బలంగా చూపించనున్నాడు. సినిమాలో ప్రభాస్ ఒక భారత సైనికుడిగా కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా ట్రాన్స్‌ఫార్మేషన్ చేసినట్టు తెలుస్తోంది. ఆర్మీ బ్యాక్‌డ్రాప్ కావడంతో, సెట్ డిజైనింగ్, యాక్షన్ సన్నివేశాలు, వార్ ఎఫెక్ట్స్ అన్నీ చాలా రియలిస్టిక్‌గా చూపించబోతున్నారు. ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 700 కోట్ల వరకు ఉంటుందని టాక్. ఇది ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ ప్రాజెక్టుగా నిలవనుందని తెలుస్తోంది. దర్శకుడు హను రాఘవపూడి, గతంలో "సీతా రామం" లాంటి హిట్ సినిమా తీసాడు. ఇప్పుడు ఈ సినిమాను కూడా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలుస్తోంది.

# భయపెడుతున్న రష్మిక



బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మ్యాడక్ ఫిల్మ్స్ హారర్-కామెడీ యూనివర్స్ లో భాగంగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'థామ'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొత్త అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'వరల్డ్ ఆఫ్ థామ' అనే పేరుతో మూవీ టీజర్ విడుదల చేశారు. ఈ సినిమాలో రష్మిక మందన్నా, అయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్ చూస్తుంటే.. ఇదొక భయంకరమైన ప్రేమకథా చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా 'అలోక్' అనే చరిత్ర పరిశోధకుడిగా కనిపించబోతున్నాడు. అతడు పాతకాలం నాటి రక్త పిశాచాల గురించి పరిశోధన చేస్తుంటాడు. రష్మిక 'తడక' అనే అతీత శక్తి గల పాత్రలో కనిపించనుంది. మొత్తానికి టీజర్ హారర్ రొమాంటిక్ థ్రిల్లర్ గా ఆకట్టుకుంటోంది.



## ప్రభాస్ నా బెస్ట్ హీరో..

శ్రీదేవి విజయ్ కుమార్ ఈ పేరు మనలో చాలా మందికి తెలియకపోవచ్చు కానీ ప్రభాస్ మొదటి సినిమాలో నటించిన హీరోయిన్ మనందరికీ గుర్తే ఉంటుంది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ కొట్టిన ఈ బ్యూటీ కొన్ని సంవత్సరాల విరామం తర్వాత తిరిగి వెండితెరపై కనిపిస్తోంది. తన తాజా చిత్రం 'సుందరకాండ' గురించి ఇటీవల ఓ ఈవెంట్ లో కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో, శ్రీదేవితో పాటు వృతి వాఘానీ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది.ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ - "సుందరకాండ సినిమాస్టోరీ వినగానే నాకు షాక్ అనిపించింది. చాలా ఫ్రెష్ స్టోరీ. ఇందులో నాకు ఒక బలమైన పాత్ర దక్కింది. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వెళ్లి కూడాల్సిన సినిమా," అని చెప్పారు. అలాగే తన కెరీర్ గురించి కూడా ఓపెన్‌గా మాట్లాడారు."హీరోయిన్‌గా పీక్‌లో ఉన్నసమయంలోనే పెళ్లి చేసుకుని, తల్లి అయ్యాను. ఆ తర్వాత కొన్నిటీవీ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఇప్పుడు నా కూతురు పెరిగి పెద్దయి స్కూల్‌కి కూడా వెళుతోంది. అలా చూసుకుంటే నేను మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యేందుకు ఇదే సరైన టైమ్ అనిపించింది," అని చెప్పకొచ్చింది శ్రీదేవి. సినిమాల్లో మళ్లీ తన రీఎంట్రీపై సంతోషం వ్యక్తం చేసింది. ఈ మూవీలో స్కూల్ డ్రెస్‌లో కనిపించే ఒక సన్నివేశం కోసం తాను ప్రత్యేకంగా డైట్ ఫాలో అయ్యారట. "నేను, నా కూతురు ఇద్దరం స్కూల్ డ్రెస్‌లో ఉన్నఫోటోలు ఉన్నాయి. అవి నా జీవితంలో ఎంతో మధురమైన జ్ఞాపకాలు," అంటూ ఆనందం వ్యక్తం చేశారు.గతంలో ప్రభాస్‌తో చేసిన తన మొదటి సినిమా 'ఈశ్వర్' గురించి కూడా శ్రీదేవి మాట్లాడారు. "ఈశ్వర్ సినిమా ద్వారా నేను హీరోయిన్‌గా పరిచయం అయ్యాను. అదే సమయంలో ప్రభాస్ కూడా హీరోగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. అప్పుడే అతనిలో ఓ పెద్ద స్టార్ అవే లక్షణాలు కనిపించాయి. ఇప్పుడు ప్రభాస్ గ్లోబల్ స్టార్ అయ్యాడు. అది చూసి నిజంగా చాలా గర్వంగా ఉంది. ఆయన దానికి పూర్తిగా అర్హుడు. ప్రభాస్ అప్పట్లో ఎలా ఉన్నారో, ఇప్పటికీ అలాగే ఉన్నారు. అంతే భాద్యతతో, అంతే సరదాగా ఉంటారు. చిన్న పిల్లలలా మెలుగుతారు," అని చెప్పకొచ్చారు."ఫస్ట్ సినిమా కావడం వల్ల మాకు ఇద్దరికీ అప్పట్లో చాలా టెన్షన్ ఉండేది. ఒకటి కాదు మా మధ్య అనేక జ్ఞాపకాలూ ఉన్నాయి. ఈశ్వర్ సినిమా మా జీవితాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ప్రాజెక్ట్," అంటూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు శ్రీదేవి విజయ్ కుమార్.

## కూలీ ఎఫెక్ట్.. లోకేష్ ప్లాన్ ఛేంజ్..?



కూలీ తర్వాత లోకేష్ కనగరాజ్ తన నెక్స్ట్ సినిమాను కార్తితో ఖైదీ 2నే చేస్తాడని అందరు అనుకున్నారు. దాదాపు లోకేష్ కూడా కూలీ సినిమా ప్రమోషన్స్ లో నెక్స్ట్ ఖైదీ 2నే అంటూ చెప్పకొచ్చాడు. ఖైదీ 2 స్క్రిప్ట్ 34 పేజీలు అద్భుతంగా వచ్చిందని చెప్పాడు. లోకేష్ కనగరాజ్ మీద ఆడియన్స్‌పై గురి ఏర్పడిన సినిమా ఖైది. కార్తి, లోకేష్ ఈ కాంబో పై ఎలాంటి హైప్ లేకుండానే వచ్చింది ఖైది. ఆ సినిమా ఇచ్చిన క్రేజ్ తో ఏకంగా ఎల్.సి.యు నే మొదలు పెట్టాడు లోకేష్.ఇక విక్రం తో మనోడి రేంజ్ మారిపోయింది. అసలు కూలీ కూడా ఎల్.సి.యు తరహాలోనే తీస్తున్నాడని తెగ హడావిడి చేశారు కానీ లోకేష్ ఎందుకో దీన్ని స్టాండలోన్ సినిమాగా ముగించాడు. ఐతే కూలీ తర్వాత ఇమిడియట్ గా కార్తి సినిమానే మొదలు పెట్టాలని అనుకున్న లోకేష్ ఇప్పుడు తన డెసిషన్ మార్చుకున్నాడని తెలుస్తుంది. కూలీ సినిమా చూసిన చాలామంది లోకేష్ వర్క్ కి సంతృప్తి కాలేదు. అందుకే తన స్టామినా ప్రూవ్ చేసుకోవాలని మళ్లీ మరో మల్టీస్టారర్ తోనే రావాలని చూస్తున్నాడట. ప్రస్తుతం దానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందట. ఈసారి లోకేష్ కనకరాజ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో పాటు లోకనాయకుడు కమల్ హాసన్ ఇద్దరితో కలిసి ఒక క్రేజీ మల్టీస్టారర్ ప్లాన్ చేస్తున్నాడట. లోకేష్ కాంబోలో రజనీ, కమల్ మల్టీస్టారర్ అంటే ఇక అంచనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.విక్రం తో కమల్ కి సెన్సేషనల్ హిట్ ఇచ్చాడు లోకేష్. ఐతే రజనీతో కూలీ అన్ సాటిస్ఫైడ్ అనే చెప్పొచ్చు. కలెక్షన్స్ ఎలా ఉన్నా రజనీ, లోకేష్ కాంబో రేంజ్ సినిమా కాదని అంటున్నారు. అందుకే లోకేష్ ఖైదీని పక్కన పెట్టి మళ్లీ రజనీ, కమల్ హాసన్ తో పనిచేయాలని చూస్తున్నాడట. ఐతే ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ బయటకు రావాల్సి ఉంది. లోకేష్ నిజంగానే ప్లాన్ మార్చాడా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది. లోకేష్ కనగరాజ్ ఖైదీ 2 కూడా భారీ హైప్ తో వస్తుంది. కార్తిలోనే ఊర మాస్ ని ఎక్స్ పోజ్ చేసిన సినిమా ఖైది. ఐతే ఆఫ్టర్ ఇయర్స్ ఖైదీ 2 వస్తుంది కాబట్టి ఆ మూవీపై కూడా భారీ క్రేజ్ ఉంది. అదీగాక ఎల్.సి.యు లో వస్తున్న ఖైదీ 2లో ఎవరెవరు ఉంటారన్న ఆసక్తి కూడా ఆడియన్స్ లో ఉంది. సో ఏ సినిమాతో వచ్చినా లోకేష్ ఈసారి మాత్రం డబుల్ ధమాకా ఇస్తాడని అంటున్నారు.



## ఆశా కార్యకర్తల ధర్నా

ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేలు స్థిర వేతనం చెల్లించటంతో పాటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత డిమాండ్ చేశారు. ప్రతి నెల రెండో తేదీ నాటికి వేతనాలు అందించాలన్నారు. తమ డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు.

## ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



తాండూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని తాండూర్‌లో మంగళవారంనిర్వహించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేడిపల్లి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు సబ్బని సమ్మన్న, ప్రధాన కార్యదర్శి పుప్పాల శోభన్, కోశాధికారి రమేశ్, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎస్కే మోయిన్, పుప్పాల సురేష్, రంజిత్, దుర్గాప్రసాద్, షారుఖ్, వెంకటేష్ పాల్గొన్నారు.

### కాగజ్‌నగర్‌లో...



కాగజ్‌నగర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాగజ్‌నగర్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా నుండి ర్యాలీని ప్రారంభించి మార్కెట్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ మందే డాగ్యురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు డాక్టర్ ప్రవీణారెడ్డి సంతాప సభ

జన్నారం, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం 4 గంటలకు డాక్టర్ ప్రవీణారెడ్డికి సంతాప సభ నిర్వహించనున్నట్లు ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోతు విజయ శంకర్, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజలింగు తెలిపారు. 40 ఏళ్లుగా జన్నారం, దండేపల్లి మండల ప్రజలకు వైద్య సేవలు అందించిన ప్రవీణారెడ్డి మృతి బాధాకరమని పేర్కొన్నారు. ఈ సభకు అన్ని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు హాజరై నివాళులర్పించాలని కోరారు.

# ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి నది

### వట్టివాగు ప్రాజెక్టుకు రెండు గేట్ల ఎత్తివేత
### లోతోట్టు ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరిక

ఖానాపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు కుంటలు, చెరువులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మేడమ్ పల్లి గ్రామ శివారులలో దట్టమైన అటవీ ప్రాంతంలోనూ ఉన్న సదర్మాట్ ఆయకట్టు ఎగువ భాగంలో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి భారీగా వరద నీరు చేరడంతో సదర్మాట్ ఆయకట్టులో ఉప్పొంగి పొర్లుతున్న వరదనీరు గోదావరి నదిలోకి చేరితుంది. వీక్షించేందుకు ప్రేక్షకులు భారీగా తరలివస్తున్నారు. గోదావరి నదిపై పురాతన కాలంలో నిర్మించిన సదర్మాట్ ఆయన కట్టులో ఎగువ ప్రాంతంలో ఉన్న శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి 34 గేట్లు తెరిచి గోదా వరిలోకి వరద నీరును వదలడంతో సదర్మాట్ ఆయకట్టు రాతిమత్తడిపై నుంచి పొంగిపొర్లుతు పోతున్న గోదావరి నదిలోకి వరద నీరు పోవడంతో అక్కడి వచ్చిన ప్రేక్షకులను కనువిందులు చేస్తున్నాయి. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీ మండలంలోని ఉల్లిపిట్ట జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొమురం భీం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. రెండు నుంచి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో కొమురం భీం ప్రాజెక్టు ల్లోకి భారీ వరద నీరు వచ్చి చేరింది. దీంతో మంగళవారం ఉదయం అధికారులు ప్రాజెక్టులోని 4 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు.



## ఓట్ల దొంగతనం ప్రజాస్వామ్య హత్యే : ఈసీ జవాబు చెప్పాలి

ముథోల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)



దేశరాజధానిలోఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్ నాథ్ నాయక్ మంగళవారం ఒక్క ప్రకటనలో ఖండించారు. దేశంలో జరుగుతున్న ఓట్ల తొలగింపు కర్ణాటక లో 1 లక్ష ఓట్లు, బీహార్ లో 58 లక్షల ఓట్లు పై వివరణ కోరిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు విపక్ష ఎంపీలను అరెస్టు చేయడం, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటు ప్రజల శక్తి,దానిని దొంగిలించడం అంటే ప్రజా స్వామ్యాకు విరుద్ధంమని అన్నారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతను వదిలి, కేంద్ర ఒత్తిడికి తలొగ్గి నిశ్శబ్దంగా వ్యవహరించడం అనుమానాస్పదమని ఆరోపించారు. ఎన్నికల సంఘం వెంటనే వివరణ ఇవ్వాలని, పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజల ఓటు హక్కు రక్షణలో నిష్పక్షపాతం గా ఉండాలని డిమాండ్ చేశారు. ఓట్ల దొంగతనానికి నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యా ప్తంగా ఉద్యమానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు.

# విద్యార్థుల హాజరుపై దృష్టి సారించాలి



ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు, ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యార్థుల హాజరుపై మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాఠశాలల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల హాజరుపై అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులు విధుల పట్ల సమయ పాలన పాటించాలని, ఫేస్ రిజిస్ట్రేషన్ సిస్టం ప్రకారం నమోదు చేసుకోవాలని, చెప్పారు. సెలవుపై వెళ్లే ఉపాధ్యాయులు ముందుగా అనుమతి పొందాలని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించాలని తెలిపారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ వినతిపత్రం

నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)



ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ మంగళవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో పాత్రికేయులు కలెక్టర్‌కు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమకు ఇండస్థలాలను కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ వినతి అందించారు. తప్పకుండా అధికారులతో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి న్యాయం చేసేటట్లు చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.



## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కుభీర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

ముధోల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వినతిపత్రం అందించారు. మంగళవారం నిర్మల్‌లో మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందించి బాసర గోదావరి పర్యాయక ప్రాంతంతో పాటు ఆయా మండలాల్లో వాగులు వరదలు వల్ల పంట భూములు దెబ్బతిన్నాయని అధికారులు వెంటనే సర్వే చేసి రైతులకు పర్యారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు పేర్కొన్నారు.

## వరద బాధితులను ఆదుకుంటాం

సారంగాపూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

సారంగాపూర్ మండలం జాం గ్రామ సమీపంలో గల కల్వర్టు ను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాల వల్ల కల్వర్టులు వరద నీటి ఉధృతికి దెబ్బతిన్నాయని, తిరిగి త్వరితగతిన వాటికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంత రం మండలంలోని స్వర్ణ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో - ఔట్ ఫ్లో సంబంధిత వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్ పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగిన బాలుడు

బోథ్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

మండలంలోని సాకేర గ్రామానికి చెందిన రిషి (3) మంగళవారం ఇంట్లో ఆడుకుంటూ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు బోథ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రాథమిక వైద్యం చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో అదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో బైక్‌పై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)

భారీ వర్షాలతో నీట మునిగిన పంట పొలాలకు కారు వెళ్లలేని తరుణంలో ప్రత్యామ్నాయంగా బైక్ పై ప్రయాణం చేస్తూ నష్టపోయిన పంటలను పరిశీలించారు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. గత నాలుగు రోజులుగా జిల్లాలు కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన పంట పొలాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగానే భీంపూర్ మండలంలో ఎమ్మెల్యే బైకుపై సుడిగాలి పర్యటన చేశారు. మహారాష్ట్ర అనుకొని ఉన్న కరంజి, గోముత్రి, అంతర్గావ్, అర్లి, వడూర్, గుబిడి, ధనోర, భీంపూర్, కరణ్ వాడి గ్రామాల్లోని పెన్ గంగా నది ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడవద్దని తాము అండగా ఉంటామని వారికి ధైర్యం కల్పించారు. నష్టపోయిన ప్రతీ రైతుకు నష్టపరిహా రం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని తెలిపారు. పంట నష్టం పై రానున్న అసెంబ్లీ సమావేశంలో పార్టీ తరపున గట్టిగా తమ వాణి ని వినిపిస్తామన్నారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి వచ్చేలా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రైతు పక్షపాతి కేసీఆర్ దృష్టికి నష్టం వివరాలను తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**దార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులు - ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**





**జైనూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఆబ్కారీ మద్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 20వ తేదీన జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో కలిసి వసతి గృహ నిద్ర చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర సకల సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యా వ్యవస్థను పటిష్ట పరచడం జరిగిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచి విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా శుద్ధమైన తాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయడం జరిగిందని, విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఒక జత ఏకరూప దుస్తులను అందించడం జరిగిందని తెలిపారు. బడి బయట ఉన్న బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల విద్యాధికారులు, పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కావలసిన సదుపాయాలు సమకూర్చడంతో పాటు ఆయా పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి రాత్రి బస చేసి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సమయానుసారంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రికి జిల్లా కలెక్టర్, ఎస్.పి. కాంతిలాల్ సుభాష్‌తో కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఎస్సారెస్పీని సందర్శించిన
# మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
గోదావరి నదిపై నిర్మించిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిండిపోవడంతో మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలవల్ల ప్రాజెక్ట్ లోకి వరద నీరు వచ్చి చేరుతుందని, ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీ సోయం బాపురావు, తదితరులు ఉన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు
# ప్రశాంతంగా జరుపుకోవాలి
### ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్

**ఉట్నూర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి గణేష్ మండపం వద్ద కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. విగ్రహం స్థాపించే స్థలం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, నవరాత్రులు, నిమజ్జనం సమయంలో తీసుకునే విషయాల్లో జాగ్రత్తలపై వివరించారు. డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

# ఓరియంట్ గుర్తింపు ఎన్నికలపై స్పష్టతేదీ?

**ఈ నెల 29న నిర్వహించేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ**




**కాసిపేట, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై నీలినీడలు వీడడం లేదు. హైకోర్టు ఉత్తర్వులిచ్చినా కార్మికశాఖ ఏదో ఓ కారణం చూపుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈనెల 19న నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులివ్వగా షెడ్యూల్, ఎన్నికల తేదీ ప్రకటించిన కార్మికశాఖ డీసీఎల్ 16న ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఈ నెల 18న సాయంత్రం యథావిధిగా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పినప్పటికీ కార్మికశాఖ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఎన్నికలు నిర్వహించలేదని కోర్టు దృష్టికి కార్మిక సంఘాలు మంగళవారం తీసుకెళ్లడంతో ఈనెల 29న నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతుండగా, ఏతేదీన నిర్వహిస్తారు? షెడ్యూల్ ఏమిటి? అనే దానిపై ఇంకా కార్మికశాఖ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికశాఖ కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ కేవలం 257మంది ఓటర్లకు ఎన్నికలు నిర్వహించకుండా నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతోందని ఆరోపిస్తున్నారు. ఇటు న్యాయస్థానాల విలువలు దిగజారేలా ప్రవర్తిస్తూ తమ శాఖ పరువు కూడా తీసుకుంటోందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈసారైన గడువులోపు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కార్మికశాఖ అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి మళ్లీ ఏవైనా కారణాలు వెతుకుతారా? అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి.

## నేడు ఆసిఫాబాద్ జిల్లాలో
# మంత్రి జూపల్లి పర్యటన

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను బుధవారం జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించనున్నారు. ముందుగా రెబ్బెన మండలంలోని పెట్రోల్ బంక్ ఏరియా వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు ఎన్టీఆర్ కాలనీని సందర్శించనున్నారు. అక్కడి నుంచి నేరుగా దహెగాం మండలం పెసర కుంట గ్రామాన్ని సందర్శిస్తారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని శిథిలమైన నివాసాలను చూడనున్నారు. తర్వాత ఆసిఫాబాద్ మండలంలోని రాజర గ్రామంలో తెగిపోయిన కల్వర్టును పరిశీలిస్తారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వరదలు, జిల్లా అభివృద్ధి పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు

**ఇంద్రవెల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని రేపల్లివార్ అశోక్, రేపల్లివార్ లక్ష్మణ్, మోరే అజయ్‌లు ప్రతి రోజు గంజాయి తాగుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు వారికి గంజాయి యూరిన్ కిట్ ద్వారా పరీక్షించగా పాజిటివ్ వచ్చిందని, దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి అమ్మినా, తరలించిన తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గుండెపోటుతో యువకుని మృతి

**బెల్లంపల్లి, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణానికి చెందిన సూర దినేష్ అనే యువకుడు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. చిన్నతనంలోనే దినేష్ గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు.





# వరద బాధితులకు తక్షణ సహాయం అందేలా చర్యలు

## జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు







**ఆదిలాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ముందుగా ఆదిలాబాద్ పట్టణంలోని శాంతి నగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం భారీ వర్షాలతో వచ్చిన వరదలు నష్టం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారీ వర్షాలు వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆ నివేదికను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆ మేరకు నిధులు కేటాయించాలని కోరతానన్నారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి, తంతోలి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. వర్షాల కారణంగా పొలాలు, గృహాలు, రహదారులు, బ్రిడ్జిలు నష్టపోయాయని సర్వే అనంతరం బాధితులకు సహాయం అందిస్తామన్నారు. అదేవిధంగా జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు గత మే నెలలో తరోడా వంతెన దాటే క్రమంలో అనుకోకుండా వచ్చిన తీవ్రమైన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి దుర్మరణం చెందారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ నుండి బాధితుడి కుటుంబీకులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంత్రి జూపల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విటల్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజాన్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ శ్యామల దేవి,ట్రైనీ కలెక్టర్ సలోని,అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు శుభవార్త చెప్పిన మంత్రి...**
తెలంగాణలో గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయి. ఈ వర్షాల ధాటికి ప్రాజెక్టులు అన్నీ నిండిపోగా, నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఖరీఫ్ నాట్ల సీజన్ జోరందుకోగా.. ఈ వానల దెబ్బకు వరి పొలాలు అన్నీ చెరువులను తలపిస్తూ, వేసిన నాట్లన్నీ కొట్టుకు పోయాయి. అలాగే పత్తి, మొక్కజొన్న, మిరప, సోయాబీన్ పంటలన్నీ నీట మునిగి మొక్కలు కుళ్లిపోయాయి. దీంతో రైతులు తీవ్ర వేదనలో మునిగిపోయారు. పెట్టిన పెట్టుబడులు, తెచ్చిన అప్పులన్నీ నీటి పాలయ్యాయని దుఃఖిస్తున్నారు. అయితే ఈ భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శుభవార్త తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్, మంత్రి అయిన జూపల్లి నేడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. పలు చోట్ల రైతులు కన్నీరు మున్నీరు అవగా, మంత్రి వారిని ఓదార్చే ప్రయత్నం చేసారు. ఈ క్రమంలో పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు రూ.10 వేల పంట నష్టపరిహారం అందిస్తామని జూపల్లి ప్రకటించారు. మంత్రి ప్రకటనపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







# రెండో రోజుకు చేరిన ఎమ్మెల్యే దీక్ష



**కాగజ్‌నగర్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
పోడు సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిర్పూరు నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా కాకుండా పూర్తిగా రద్దు చేశామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిర్పూరు నియోజకవర్గంలో అటవీ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగడం లేదన్నారు. మంత్రి సీతక్క ఏరియాలో అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చారని అన్నారు. తమ ప్రాంతానికి మాత్రం ఇంత వరకు అనుమ తులు రాలేదన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని తెలిపారు. నిరవధిక దీక్ష శిబిరాన్ని ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కార్యకర్తలు సందర్శించి మద్దతు పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, ఆశోక్, చన్కపురి గణపతి, సాంబయ్య, బాల్కశ్యాం, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సిఐ ప్రేంకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వైద్యులు డాక్టర్ హరీష్ బాబు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

**స్పీకర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే..**
పోడు సమస్య విషయంలో న్యాయం చేయాలని మంగశవారం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఎమ్మెల్యే హరీష్‌బాబు లేఖ రాశారు. సిర్పూరు నియోకవర్గంలో పోడు పరిస్థితిని, అటవీ శాఖ అధికారుల వేధింపులు తదితర అంశాలను ప్రస్తావిస్తూ తాను నిరవధిక దీక్ష చేపడుతున్నట్టు ఆ లేఖలో వివరించారు.



# సిర్పూర్‌లో పులి కలవరం

**ఆవుపై దాడి చేసి హతమార్చినపులి - భయాందోళనలో స్థానికులు**

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ఫారెస్ట్ రేంజ్ లో పులులు సంచారం కలవరం రేపుతోంది. సిర్పూర్ (టీ) అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవు పై పెద్దపులి దాడి హతమార్చింది. బెస్తవాడకు చెందిన బానే రాంచందర్ చెందిన ఆవు సోమవారం అటవీలో మేతకు సాయంత్రం తిరిగి వస్తుండగా పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని పరి శీలించి పంచనామా నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయ ఖరీఫ్ సీజన్ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో పులుల సంచారం వారిని కలవర పెడుతోంది. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు.

# అత్యంత అరుదైన 'బ్లూ మష్రూమ్స్'

**ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ప్రభాత సమాచారం)**
ప్రపంచంలో అత్యంత అరుదైన బ్లూ కలర్ మష్రూమ్ తెలంగాణలో బయటపడింది. రాష్ట్రంలోని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ విభాగంలో ఈ అరుదైన పుట్టగొడుగును కనుక్కున్నారు. అత్యంత ఆకర్షణీయమైన ఈ శిలీంధ్రంను 'బ్లూ పింక్‌గిల్' అని పిలుస్తారు. ఇది న్యూజిలాండ్‌కు చెందిన ఒక ప్రత్యేక శిలీంధ్ర జాతి. అంతేకాదు న్యూజిలాండ్ దేశం కరెన్సీ 50 నోటుపై కూడా ఈ అందమైన బ్లూ మష్రూమ్స్ బొమ్మ ఉంటుంది. అక్కడి మావోరీ సంస్కృతిలో కూడా ఈ శిలీంధ్రానికి ప్రత్యేక స్థానం ఉంది. మనదేశంలోని పశ్చిమ కనుమల్లోని కదంబ రిజర్వ్ ఫారెస్టుతోపాటు మరికొన్ని దట్టమైన అడవుల్లో పెరుగుతుందని జంతుశాస్త్ర పరిశోధనవేత్తలు చెబుతున్నారు. దీనికి ఈ అరుదైన బ్లూ కలర్ అజులీన్ రంగు పిగ్మెంట్ల నుండి వస్తుంది. అయితే ఈ పుట్టగొడుగులు విషపూరితమా కాదా అనేది పూర్తిగా తెలియక పోయినా.. అటవీ అధికారులు మాత్రం దీనిని తినకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY